## మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడి నియామకం



రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న చెన్న సోమశేఖర్, కుందారపు శంకరమ్మ

రెబ్బెన, జూన్ 22: తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నంబాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్‌ను నియమించినట్లు తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా చెన్న సోమశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండో సారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్‌కు తనకు సహకరించిన రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతం, మున్నూరుకాపుల ఐక్యతను చాటేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా శంకరమ్మ..**

మున్నూరు కాపు సంఘం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కుందారపు శంకరమ్మ నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య పటేల్ తెలిపారు. తనను నియమించినందుకు దేవయ్య పటేల్‌తో పాటు, సహకరించిన రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులకు కుందారపు శంకరమ్మ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

## క్రమశిక్షణా కమిటీ చైర్మన్ ఎన్నిక

సీసీసీ నస్పూర్, జూన్ 22 : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. నస్పూర్‌కాలనీలోని టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే న్యూటెక్ గని పిట్ కమిటీ ఆధ్వర్యంలో సురేందర్‌రెడ్డితో పాటు, ఇటీవల ఏరియా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బండి రమేశ్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలం పాటు, కార్మిక క్షేత్రంలో పనిచేసిన సురేందర్‌రెడ్డి క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా ఎన్నికవడం సంతోషదాయకమన్నారు. అందరం కలిసికట్టుగా యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ లాల, మహిపాల్‌రెడ్డి, బుద్ధి ప్రసాద్, ఉప్పాల సంపత్, జైపాల్ రెడ్డి, అడ్లూరి అనిల్, రాజు, సందీప్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

కాగజ్‌నగర్, జూన్ 22: రాష్ట్ర పాలనలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన కీలక శాఖల మంత్రి పోస్టులు ముఖ్యమంత్రి తమ వద్ద పెట్టుకోవడంతో పాలన గాడితప్పుతుందని విమర్శించారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తమపై పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమాజ సేవే లయన్స్‌క్లబ్ లక్ష్యం

జైపూర్, జూన్ 22 : సమాజసేవే లయన్స్ క్లబ్ లక్ష్యమని డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. జైపూర్ మండలకేంద్రంలో ఆదివారం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. అధ్యక్షుడిగా చల్లా సత్యనారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శిగా మంథెన లక్ష్మణ్, కోశాధికారిగా ముదాం రమేశ్, మొదటి, రెండో ఉపాధ్యక్షులుగా రాజబాపురెడ్డి, రాచకొండ రవీందర్‌రావు, సభ్యులుగా తాటిపెల్లి శ్రీనివాస్, జక్కుల వెంకటేశం, గుండా శ్రీనివాస్, తొగరి శ్రీనివాస్‌తో ప్రమాణస్వీకరం చేయించారు. అనంతరం వారికి నియామకపత్రాలు అందించారు. తాజాగా ఏర్పాటు చేసిన ఈ క్లబ్ ద్వారా కంటి వైద్యశిబిరాలు, శస్త్ర చికిత్సలతో పాటు, వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లిఖార్జున్, సెక్రటరీ వడ్లకొండ ఎల్లప్ప, డిస్ట్రిక్ట్ గవర్నర్లు ఆరె నారాయణరెడ్డి, ప్రమోద్ కుమార్‌రెడ్డి, బాలేటి శ్రీనివాస్‌రావు, ఇరుకుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘం జైపూర్ మండల కమిటీ

జైపూర్, జూన్ 22 : రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం మోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నరహరి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జైపూర్ మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేతు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గుర్రం శ్రీధర్‌రెడ్డి, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, రిక్కుల జనార్దన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా చందుపట్ల పాపిరెడ్డి, సహాయ కార్యదర్శిగా సుమన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఎర్రం మనోహరెడ్డి, చీనూరి నారాయణరెడ్డి, కోశాధికారిగా చీనూరి రాజబాబు రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు మద్దుల తిరుపతిరెడ్డి, గూడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, రిక్కుల లక్ష్మీనారాయణరెడ్డి, విశ్వంబర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫొటో, వీడియో గ్రాఫర్స్ కమిటీ..

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 22 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పిక్సెల్ హబ్‌లో ఆదివారం ఆసిఫాబాద్, వాంకిడి మండల ఫొటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్ తెలిపారు. అధ్యక్షుడిగా ఎనగందుల సందీప్, ప్రధాన కార్యదర్శి గా కుందరపు వివేక్, కోశాధికారిగా షేక్ హమీద్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్, నందు, ఇరుకుల్ల సంజీవ్, కుటుంబ భరోసా ఇన్‌చార్జిగా బొట్టుపల్లి సతీశ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వావిలాల రాజు, కోశాధికారి రచర్ల వినయ్ ఉన్నారు.

## ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం

మందమర్రి, జూన్ 22 : ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నిర్మూళనే పోలీసులు ధ్యేయమని మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి అన్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధి 3వ వార్డు ఎస్వీ టెంపుల్ కాలనీలో ఆదివారం కమ్యూనిటీ కంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని వీధులతో పాటు, అనుమానిత ప్రాంతాల్లో డాగ్‌స్క్వాడ్‌తో విస్తృత తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలు లేని 27 బైకులు, 4 ఆటోలు సీజ్ చేశారు. ఓ ఇంట్లో సోదా చేయగా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 8 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని మహిళపై కేసు నమోదు చేశారు. అనంతరం మత్తు ప్రదార్థాలతో పట్టుబడితే తీసుకునే చట్టపరమైన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ నేర నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, మందమర్రి, రామకృష్ణాపూర్ ఏఎస్ఐలు శ్రీనివాస్, లలిత పాల్గొన్నారు.

## 'ప్రజల చేతిలో కళాయుధం మునీర్'

మందమర్రి, జూన్ 22 : సింగరేణి క్షేత్రంలో వెల్లువెత్తిన ప్రజా ఉద్యమాలు తమ కళాయుధంగా మునీర్‌ను తీర్చి దిద్దుకున్నాయని వక్తులు కొనియాడారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో సీనియర్ జర్నలిస్ట్, సామాజిక ఉద్యమకారుడు ఎండీ మునీర్ సంస్మరణ సభను ఆయన మిత్రులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి మిత్రులు సహచరులు, అనుచరులతో పాటు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులరిపంచారు. మునీర్ సన్నిహిత మిత్రులు, టీబీజీకేఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ అబ్బాస్, వై సత్యం, తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్ రవీందర్, తెలంగాణ విద్యావంతుల వేదిక మాజీ అధ్యక్షుడు గురిజాల రవీందర్ రావు, సీనియర్ జర్నలిస్ట్ మాదాసు రామ్మూర్తి, ఐఎఫ్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు సంపత్, ఎంసీపీఐ నాయకుడు సబ్బని కృష్ణ, కవి రచయిత సుంధిళ్ల రాజన్న, తెలంగాణ రచయిత వేదిక ప్రధాన కార్యదర్శి చర్లపెల్లి కుమారస్వామి, వజీర్ సుల్తాన్, ప్రభాకర్, కనకయ్య పాల్గొన్నారు.

- తాగు నీటికీ తప్పని తిప్పలు
- పగిలిన కిటికీల అద్దాలు, విద్యుత్ బోర్డులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- 560కి గాను కేటాయించినవి 243 గృహాలు
- నివాసముంటున్నది 30లోపే కుటుంబాలు

# అరకొర వసతులు.. లబ్ధిదారుల అవస్థలు

**డబుల్ బెడ్రూం ఇండ్లలో కానరాని సౌకర్యాలు**


మందమర్రిలో లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లు


ఇండ్ల మధ్య ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



పగిలిన కిటికీల అద్దాలు, ఊడిపోయిన స్విచ్ బోర్డులు

మందమర్రి, జూన్ 22 : పేదల సొంతింటి కళ సాకారం చేసేందుకు గానూ కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. ఇంతలోనే శాసనసభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇండ్ల పంపిణీలో మరింత జాప్యం జరిగింది. అయితే రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మద్యం ప్రియులు, పోకిరీలకు డబుల్ బెడ్రూం ఇండ్లు అడ్డాలుగా మారాయి. ఇండ్లకు అమర్చిన విద్యుత్ తీగలు, స్విచ్ బోర్డులు, కిటికీల అద్దాలను దుండుగులు ధ్వంసం చేశారు. వాటికి మరమ్మతులు చేయకుండానే ఇండ్లు కేటాయించడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మందమర్రి మున్సిపాలిటీ పరిధి ప్రాణహిత కాలనీ సమీపంలో కేసీఆర్ ప్రభుత్వం 560 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. నిర్మాణం పూర్తి కావడంతో సర్వేలు నిర్వహించి, లబ్ధిదారులను కూడా ఎంపిక చేసింది. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆధ్వర్యంలో 2023, అక్టోబర్ 1న అప్పటి రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించారు. ఇంతలోనే శాసనసభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు ప్రక్రియను నిలిపివేశారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇండ్ల పంపిణీలో మరింత జాప్యం జరిగింది. అయితే రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో విద్యుత్ తీగలు, స్విచ్ బోర్డులు, కిటికీల అద్దాలను దుండుగులు ధ్వంసం చేశారు. కొన్ని ఇండ్లలో విద్యుత్ బోర్డులతోపాటు, తాగునీటి సరఫరా పైపులు, సెప్టిక్ ట్యాంకుల పైపులను ఎత్తుకెళ్లారు. వాటికి మరమ్మతులు చేపట్టకుండానే కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత గత జనవరిలో కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు 243 ఇండ్లను అధికారులు లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయించారు. పంపిణీ సమయంలో కాంగ్రెస్ నాయకులు గత ప్రభుత్వం హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలోని పేర్లను తొలగించి, తమకు అనుకూలమైన అనర్హుల పేర్లను చేర్చారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి.

**మౌలిక వసతులు లేక ఇక్కట్లు..**

అధికారులు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లలో కనీస మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కేటాయింపు అనంతరం ఇండ్లను పరిశీలించిన లబ్ధిదారులు అక్కడికి వెళ్లేందుకు నిరాసక్తత వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో పాటు, స్థానిక అధికారులు పలుమార్లు సందర్శించి, మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పడంతో కొందరు నివాసముంటున్నారు. 243 ఇండ్లు కేటాయించగా, వసతులు లేక ఇప్పటివరకు 30లోపు లబ్ధిదారులే అక్కడ ఉంటున్నారు. ఇండ్లలో ధ్వంసమైన విద్యుత్ పరికరాలను లబ్ధిదారులే సరిచేసుకుంటున్నారు. కాగా, వసతుల కల్పనను పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని, అరకొర వసతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.


బెజ్జూర్ : వర్షాలు రాక బోసిపోయిన వాగులు


బెజ్జూర్ : సాగుకు సిద్ధం చేసిన భూమి

# ముఖం చాటేసిన వరుణుడు

- జూన్ గడుస్తున్నా కురవని వర్షాలు
- పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు నాటిన రైతులు
- సరైన వానలు లేక మొలకెత్తని గింజలు
- మళ్లీ నాటాలంటే ఆర్థిక భారం తప్పదని ఆవేదన

కాసిపేట/బెజ్జూర్, జూన్ 22 : విత్తనాలు నాటి వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు వరణుడు ముఖం చాటేశాడు. మే నెల రెండో వారం నుంచే ఆడపాదడపా వానలు పడడంతో సాగుకు అనుకూలిస్తుందని అన్నదాతలు ఆనందపడ్డారు. వాతావరణ శాఖ అధికారులు సైతం ముందస్తుగానే కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. దీంతో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని రైతులు దుక్కులు దున్ని, సాగుకు సిద్ధమయ్యారు. పలు చోట్ల మే 20వ తేదీ.., మరి కొన్ని చోట్ల జూన్ మొదటి వారం నుంచే పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు నాటారు. ఇందుకు ఎకరాకు సుమారు రూ.10 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఒకటి, రెండు మంచి వర్షాలు పడగానే మొలకలు వస్తాయని అంతా భావించారు. మధ్యలో చిరుజల్లులు కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. కానీ, మళ్లీ వర్షపు జాడలేకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇటీవల పలు చోట్ల ఆకాశం మేఘావృతమైనా వానపడలేదు. రానున్న రెండు, మూడు రోజుల్లో మంచి వర్షం పడితేనే పత్తి విత్తనాలు మొలకెత్తే అవకాశమున్నది. లేకపోతే భూమిలోనే పాడవుతాయని, మళ్లీ నాటాల్సి వస్తుందని ఆవేదనకు గురవుతున్నారు. ఈ కారణంగా పలువురు రైతులు వర్షాలపై ఆశలు వదిలేసుకున్నారు. మళ్లీ నాటేందుకు విత్తనాలు కొనుగోలు చేయాలంటే ఆర్థిక భారం తప్పదని ఆందోళన చెందుతున్నారు.

## ఆర్ఎంపీ వైద్యం వికటించి ఒకరి మృతి

- బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖాన ఎదుట కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన


బెల్లంపల్లి : ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు


శ్రీనివాస్(ఫైల్)

దహెగాం/నెన్నెల, జూన్ 22 : ఆర్ఎంపీ డాక్టర్ అందించిన వైద్యం వికటించడంతో నెన్నెల మండలం గొల్లపల్లికి చెందిన లింగంపల్లి శ్రీనివాస్(36) మృతి చెందిన ఘటన దహెగాం మండలంలోని గెర్రె గ్రామంలో చోటుచేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కొంత కాలంగా అర్షమొలల వ్యాధితో బాధపడుతున్నాడు. శనివారం అతని భార్య, తల్లితో కలిసి దహెగాం మండలం గెర్రె గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడు బినయ్ సర్కార్ వద్దకు చికిత్స కోసం తీసుకువచ్చారు. అర్షమొలల నివారణ కోసం వైద్యుడు బినయ్ సర్కార్ చికిత్సలో భాగంగా ఇంజక్షన్ ఇవ్వడంతో శ్రీనివాస్ స్పృహ కోల్పోయాడు. ఇంజక్షన్ వికటించిందని భావించి వెంటనే ఆర్ఎంపీ తన కారులో శ్రీనివాస్‌ను దహెగాం తరలిస్తుండగా ఒడ్డుగూడ, లగ్గాం గ్రామాల మధ్యలో మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో 108 అంబులెన్స్‌లో దహెగాంలోని పీ హెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యసిబ్బంది సూచన మేరకు బెల్లంపల్లికి తరలించగా, అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ విక్రమ్‌ను సంప్రదించగా, మృతుడి భార్య కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

**యాక్సిడెంట్‌గా చిత్రీకరించే ప్రయత్నమా..?**

ఇంజక్షన్ వికటించడంతో స్పృహ కోల్పోయిన శ్రీనివాస్‌ను ఆర్ఎంపీ వైద్యుడు బినయ్ సర్కార్ తన కారులో తరలిస్తూ కావాలనే కారును పొలాల్లోకి దించి యాక్సిడెంట్‌గా చిత్రికరించేందుకు ప్రయత్నించాడని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. కారు అదుపుతప్పిన తర్వాత శ్రీనివాస్‌ను 108 అంబులెన్స్‌లో దహెగాం పీహెచ్‌సీకి తరలించి ఆర్ఎంపీ పరారు కావడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.

**న్యాయం కోసం బాధితుల ధర్నా..**

బెల్లంపల్లి, జూన్ 22 : న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు బెల్లంపల్లిలోని వంద పడకల దవాఖాన ఎదుట గల జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. మృతికి కారణమైన వైద్యుడు బినయ్ సర్కార్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ భార్య కళ్యాణి, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. పోస్టుమార్టం చేయకుండా పోలీసుల జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడి తరపున పోలీసులు జరిపిన బేరసారాలు ఫలించలేదు. ఇటు వైద్యుడిపై చర్యలు లేకపోవడంతో విసిగిపోయిన బాధితులు ధర్నాకు దిగారు. ఎక్కడికక్కడా పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. బెల్లంపల్లి, తాండూర్, మందమర్రి ప్రాంతాల నుంచి పోలీసులు వచ్చారు. నష్టపరిహారంతో పాటు, వైద్యుడిపై కేసు నమోదు చేయాలని బాధితులు భీష్మించారు. ఆందోళనను విరమించకపోవడంతో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఘటనాస్థలికి వచ్చి, వారితో మాట్లాడారు. తగిన న్యాయం చేస్తామని ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

సీసీసీ నస్పూర్, జూన్ 22 : విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నస్పూర్‌కాలనీలోని సింగరేణి సేవా భవన్‌లో కరాటే మాస్టర్ పోచంపల్లి వెంకటేశ్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. సీసీసీ నస్పూర్ ఎస్ఐ-2 జితేందర్‌సింగ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. విద్యార్థులు మానసిక ఎదుగుదల, ఆత్మరక్షణకు కరాటే ఉపయోగపడుతుందన్నారు. ట్రస్మా సంఘం కోశాధికారి రామకృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు రేగళ్ల ఉపేందర్, నస్పూర్ పట్టణ కోశాధికారి అంబాల రాజ్‌కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్, సీనియర్ మాస్టర్స్ భూమయ్య, నాగలక్ష్మి, రవి, రంగ రమేశ్, రాజేశ్, ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

భీమిని, జూన్ 22 : భీమిని మండలం వెంకటాపూర్ గ్రామంలో కోట నగేశ్‌కు చెందిన ఆవు ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. ఉదయం ఆవు మేత మేస్తుండగా, ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతిచెందిందని బాధితుడు వాపోయాడు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని, ఆవు విలువ రూ.35 వేలు ఉంటుందని తెలిపాడు. పరిహారం అందించి, ఆదుకోవాలని కోరాడు.

## 'ఓబీసీల్లో నిశ్శబ్ద విప్లవం'

మంచిర్యాల (ఏసీసీ), జూన్ 22 : ఓబీసీల్లో నిశ్శబ్ద విప్లవం జరుగుతున్నదని, విద్య, సామాజిక,ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అవకాశాల్లో తమ స్థానంపై చర్చ సాగుతున్నదని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సెక్రటరీ, ఓబీసీ పోరుబాట పుస్తక రచయిత పరికింపండ్ల నరహరి అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఓబీసీ పోరుబాట పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కమిషన్ నివేదిక తర్వాత ఓబీసీల్లో తాము సాధించిన ప్రగతిపై చర్చ జరుగుతున్నదన్నారు. బీసీలు రాబోయే కాలంలో ఎలాంటి ఉద్యమాలు చేయాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి తీసుకోవాల్సిన అంశాలను ప్రస్తావించామని పేర్కొన్నారు. బీసీ నాయకులు నీలి శ్రీనివాస్, చిదిరాల భావన రుషి, ప్రసన్న హరికృష్ణ, చేరాల నారాయణ, చేరాల వంశీ, గుమ్ముల శ్రీనివాస్, ఒడ్డెపల్లి మనోహర్, లతీఫ్ పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాకారుల అభివృద్ధికి కృషి

నస్పూర్, జూన్ 22 : కబడ్డీ క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కృషి చేస్తుందని గౌరవాధ్యక్షుడు కాసాని వీరేశ్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో ఆదివారం కబడ్డీ మినీ అకాడమీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు సభ్యులు స్వాగతం పలికారు. క్రీడాకారులకు ఆటంకాలు కలుగకుండా వసతి కల్పించి, కోచింగ్ ఇచ్చేందుకు అసోసియేషన్ నిర్ణయం తీసుకున్నదన్నారు. ఈసీ మెంబర్ కార్తీక్, రామచంద్ర, రాజేంద్ర, శేఖర్, రవీందర్, అసోసియేషన్ అధ్యక్షుడు సాంబమూర్తి, శ్రీధర్, ఉపేందర్, మంజుల, లింగయ్య పాల్గొన్నారు.

## తరగతులు నిర్వహించాలి

కాగజ్‌నగర్, జూన్ 22 : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కేవలం 210 పాఠశాలల్లో మాత్రమే పూర్వ ప్రాథమిక తరగతులు ప్రభుత్వం ప్రారంభానికి అనుమతులిచ్చిందని, అందులో నర్సరీ, ఎల్‌కేజీ లేకుండా యూకేజీ మాత్రమే ప్రారంభిస్తామని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం కేటాయించాలన్నారు. విద్యాశాఖలో సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఉశన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఇందురావు, జిల్లా కోశాధికారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బరాంపల్లిలో చైన్‌స్నాచింగ్

చెన్నూర్ రూరల్, జూన్ 22 : ఒంటరిగా వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలో నుంచి ఇద్దరు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఘటన చెన్నూర్ మండలంలో ఆదివారం చోటుచేసుకున్నది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సుబ్బరాంపల్లి గ్రామానికి చెందిన రాతిపల్లి భూదమ్మ (75) పొరుగు ఊరు అంగరాజ్‌పల్లికి పని నిమిత్తం వెళ్లింది. తిరిగి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చి, ఆమెపై దాడి చేశారు. మెడలోని 3 తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. అనంతరం చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చేపట్టారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కౌటాల, జూన్ 22 : మండలంలోని హెట్టి గ్రామంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న 32 పశువులను పట్టుకున్నట్లు ఎస్ఐ గుంపుల విజయ్ ఆదివారం తెలిపారు. హెట్టి గ్రామం నుంచి పశువులను మూడు బోలేరో వాహనాల్లో భైంసా, జగిత్యాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే అక్కడికి వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. వీటిని తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. మూడు బొలేరో వాహనాలు, రెండు కార్లను స్వాధీనం చేసుకుని షేక్ షౌజుద్దీన్, ఎస్కే అయ్యూబ్ ఖాన్, షేక్ హలీద్ పాషా, షేక్ మోబిన్, జమీర్, రఫీ ఉల్లా ఖాన్, జహీర్, అబ్దుల్లా, జహీర్, ఫసీ ఉల్లా ఖాన్, అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పేకాట స్థావరంపై దాడి

వాంకిడి, జూన్ 22 : మండలంలోని బంబార గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం వాంకిడి దాడి చేసి, నిందితులను పట్టుకున్న ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేయగా పేకాడుతూ తొమిది మంది పట్టుబడ్డారన్నారు. వారి నుంచి రూ.2,500 నగదు స్వాధీనం చేసుకుని, వారందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా పేకాడితే 87126 70531కు లేదా 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

## బిల్డర్లపై పోలీసులకు ఫిర్యాదు

సీసీసీ నస్పూర్, జూన్ 22 : నస్పూర్‌లోని తిరుమల డెవలపర్స్ బిల్డర్లు అనుమండ్ల వెంకట్‌రెడ్డి, పెరుక ప్రతాప్, గుజ్జుల ప్రశాంత్‌రెడ్డి తమతో చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘించి, నిర్మాణ వాగ్దానాలను నెరవేర్చకుండా మోసం చేశారని, తిరుమల అపార్ట్‌మెంట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినవారు ఆదివారం సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2013లో సీసీసీ కార్నర్ సమీపంలో 4 అంతస్తులతో 48 ఫ్లాట్లతో ఆపార్ట్‌మెంట్ నిర్మించారన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అపార్ట్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్లు అడిగిన మొత్తాన్ని చెల్లించి, కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఆ సమయంలో అనేక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారని, 12 ఏళుల అవుతున్నా అసంపూర్తిగా సౌకర్యాలు కల్పించారన్నారు. లిఫ్ట్ ఏర్పాటు చేయడంలేదని, ఫ్లాట్లకు సక్రమంగా ఎర్తింగ్ అందించలేదని, విద్యుత్ కోసం జనరేటర్ ఏర్పాటు చేయలేదన్నారు. అపార్ట్‌మెంట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోవడంతోనే తాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ఇరువర్గాలపై కేసు

జన్నారం, జూన్ 22 : జన్నారం మండలం రేండ్లగూడ గ్రామంలో శనివారం జరిగిన దాడి విషయంలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. నెమలికొండ అశారాజ్ ఇంటివద్ద మగ్గిడి తిరుపతికి అశారాజ్ ఇవ్వవలసిన రూ.4 లక్షల గురించి పంచాయతీ జరుగుతున్నది. ఇందులో ముత్య రాజన్న కలుగజేసుకొని మాట్లాడగా, మగ్గిడి తిరుపతి, మగ్గిడి వెంకటేశ్ ఆయనపై దాడిచేశారు. దీంతో బాధితుడు రాజన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే మగ్గిడి తిరుపతి, మగ్గిడి వెంకటేశ్, అమృత తమను తిట్టారని, దాడిచేశారని నెమలికొండ అశారాజ్, ముత్యం రాజన్న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజన్నపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## కోతుల పట్టివేత

కౌటాల, జూన్ 22 : మండల కేంద్రంలో పలు కాలనీల్లో కోతులను ఆంధ్రప్రదేశ్‌లోకి తిరుపతికి చెందిన కార్మికులు ఆదివారం వచ్చి పట్టుకున్నారు. బోనులో బంధించి అడవిలో వదిలిపెట్టారు. కొన్ని రోజులు ఇండ్లు, దుకాణాలు, చిరు వ్యాపారుల సామగ్రిని ధ్వంసం చేయడంతో పలువురిపై దాడి చేస్తున్నాయి. ప్రజల విన్నపం మేరకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్పందించి మండల నాయకుల సహకారంతో సమస్య పరిష్కరించినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## కరెంట్ కోతలతో ఇబ్బందులు

కాగజ్‌నగర్ రూరల్ జూన్ 22 : కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నామని కాగజ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా జంబుగా, గన్నారం గ్రామాల సబ్‌స్టేషన్ పరిధిలో అయితే రోజుకు 20 నుంచి 30 సార్లు కరెంటు కట్ అవుతున్నది. గతంలో వర్షాలు, ఈదురు గాలులు వచ్చినప్పుడు కొద్ది సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేవారు. ప్రస్తుతం కరెంట్ పోతే మళ్లీ ఎప్పుడు వస్తదో అని ఎదురు చూడాల్సి వస్తున్నదని అంటున్నారు. విద్యుత్ అధికారులు, లైన్‌మెన్‌లకు ఫోన్ చేస్తే సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంట్ కోతలు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## గిరిజనుల పక్షాన పోరాటం

భీమారం, జూన్ 22 : గిరిజనుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తామని, వారి హక్కుల కోసం కొట్లాడుతామని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్ పేర్కొన్నారు. బూర్గుపల్లి గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. బూర్గుపల్లి గ్రామానికి చెందిన భూక్యా రాజ్‌కుమార్ నాయక్‌పై స్థానిక ఎస్ఐ అక్రమ కేసులు పెడుతున్నారని, కులం పేరుతో తిడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ వచ్చే నెల 3వ తేదీన జైపూర్ ఏసీపీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు నంగారా మోగించాలని పిలుపునిచ్చారు. భూక్యా పంతులు నాయక్, దశరథ నాయక్, కుశ నాయక్, లాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామకృష్ణాపూర్, జూన్ 22 : యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ రాజశేఖర్ సూచించారు. అంబేద్కర్ వార సంత సమీపంలోని కనకదుర్గా కాలనీలో ఆదివారం 'సే నో టూ డ్రగ్, ఎస్ టూ లైఫ్' నినాదంతో గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం రామకృష్ణాపూర్ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, జంగు, సిబ్బంది సురేశ్, సునీల్ పాల్గొన్నారు.

హాజీపూర్, జూన్ 22 : మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని రాపల్లి జీపీ పరిధి రామకృష్ణ ఫుడ్ ప్రాడక్ట్ కంపెనీలో కార్మికులకు హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ కుమార్ అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ రవీంద్ర కులకర్ణి, కానిస్టేబుల్ పెట్టం రాజేందర్, కంపెనీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.